క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



మక్కపేట(వత్సవాయి): గ్రామంలో వేంచేసి యున్న శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ అయ్యప్ప ఆలయ మూడో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలకు ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు. అర్చకులు అత్తలూరి యుగంధర్‌శర్మ, రేలంకి భాస్కర్‌శర్మ, గ్రామ పురోహితులు రాఘవశర్మ ఆధ్వర్యంలో శివకల్యాణాన్ని జరిపించారు. దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి పూజాక్రతువులు నిర్వహించారు. అనంతరం అయ్యప్పకు విశేష అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. ఆలయ నిర్మాణకర్త మల్లెల గాంధీ, సర్పంచ్ మల్లెల శివ, గురుస్వామి కన్నెగంటి సత్యనారాయణ, కొమరగిరి శ్రీను, లింగాల శేఖర్, కందిమళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు 522 మంది హాజరు

జగ్గయ్యపేట: ఆయా కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం స్థానిక ఉక్కు కళావేదికలో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. పట్టణంలో మొత్తం 1328మంది దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూలకు 522మంది హాజరయ్యారు. అధికారులు, బ్యాంకు సిబ్బంది కలిసి దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి కమిషనర్ ఖలిముల్లా మాట్లాడుతూ పట్టణానికి 81యూనిట్లు మంజూరైనట్లు ఆయన వివరించారు.

నేడు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

నందిగామటౌన్: ఆయా కార్పొరేషన్ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి శుక్రవారం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణబాబు తెలిపారు. దరఖాస్తుదారులు తగిన ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలని కమిషనర్ సూచించారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

జగ్గయ్యపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం ఈనెల 13వతేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీసుజాత గురువారం తెలిపారు. పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో ఉన్న గురుకుల పాఠశాలలో ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు ఐదోతరగతి ప్రవేశం కోరే విద్యార్థులకు, మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్ చేరగోరు విద్యార్థులకు పరీక్ష ఉంటుందని వివరించారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్షకు హాజరయ్యేవారు తప్పకుండా హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డుతో సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆమె సూచించారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

వీరులపాడు: వీఆర్వోలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ హుస్సేన్ ఆదేశించారు. జుజ్జూరు రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఆయన మండలంలోని వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు గ్రామీణ ప్రాంత రైతుల వ్యవసాయ భూములకు సంబంధించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా వీఆర్వోల పనితీరుపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఏఐ టెక్నాలజీదే భవిష్యత్



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): భవిష్యత్ అంతా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ టెక్నాలజీ)దేనని మైక్రోసాఫ్ట్ సంస్థ(అమెరికా)లో కృత్రిమ మేధస్సు పరిశోధకుడు ప్రియతమ్ బొల్లింపల్లి చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సు ఉపయోగాలు– ఉపయోగించడం ఎలా అనే అంశంపై కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో గురువారం సదస్సు జరిగింది. ప్రియతమ్ అతిథిగా హాజరై మాట్లాడారు. లాంగ్వేజ్‌కు సంబంధించిన డేటా ద్వారా ఏఐ టెక్నాలజీ మనిషిలాగే భాషను అర్థం చేసుకోవడంతో పాటుగా రాయడం, సందేహాలను సమాధానం చెప్పడం వంటి పనులను చేయగలుగుతుందన్నారు. సాఫ్ట్‌వేర్ కోడ్‌ను ఆటోమోటిక్‌గా సృష్టించడం, వాక్యాల అర్థం తెలుసుకోవడం అనువాదం, కస్టమర్ సపోర్ట్ కోసం చాట్ బాట్‌లు, బ్యాంకింగ్, ఈ కామర్స్, ఆరోగ్య పరిరక్షణ మొదలైన అన్ని రంగాల్లోనూ ఏఐ సేవలను సులభంగా సమర్థవంతంగా ఉపయోగించవచ్చునని చెప్పారు.

కోర్సుల్లో నైపుణ్యాలు కీలకం..

వ్యాసాలు, స్క్రిప్ట్‌లు, రిపోర్టులు తయారు చేయడం, మెడికల్ రిపోర్ట్‌లను విశ్లేషించడం, వివిధ భాషల్లో ఉన్న విద్యా సమాచారాన్ని పూర్తి స్థాయిలో మనకు అవసరమైన భాషలో అందిచడం కూడా ఏఐ టెక్నాలజీ సమర్థవంతంగా చేస్తోందని తెలిపారు. సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ టీఎస్.రవికిరణ్ పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు లేక అవస్థలు



నందిగామ మండలం దాములూరు కూడలి సంగమం వద్ద వైరా ఉపనదిపై అప్రోచ్ రోడ్డు లేక నిరుపయోగంగా మారిన బ్రిడ్జి

కంచికచర్ల: రెండు తెలుగు రాష్ట్రాలకు రాకపోకలు సాగించేందుకు వైరా, కట్టలేరుపై బ్రిడ్జి నిర్మించినప్పటికీ అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడంతో ఆ బ్రిడ్జి కాస్తా నిరుపయోగంగా మారింది. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాలు, వరదలు వచ్చిన ప్రతిసారీ ఈరోడ్డుపై రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతుండటంతో ప్రజలు అవస్థలుపడుతున్నారు. నందిగామ, వీరులపాడు మండలాల మధ్య వైరా, కట్టలేరు కూడలి సంగమ ప్రాంతంలో నిర్మించిన కాజ్‌వే పైకి వర్షాకాలంలో భారీగా నీరు చేరుతుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినప్పటికీ అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో ఈప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు.

వర్షాకాలంలో రాకపోకలు బంద్..

నందిగామ మండల పరిధిలోని దాములూరు, వీరులపాడు మండల పరిధిలోని పల్లెంపల్లి గ్రామాల మధ్య వైరా, కట్టెలేరు సంగమ ప్రాంతం ఉంది. ఉపనదులను దాటేందుకు దశాబ్దాల కిందటే కాజ్‌వే నిర్మించారు. కాలక్రమంలో రాకపోకలు సైతం గణనీయంగా పెరిగాయి. దీనికితోడు ఖమ్మం జిల్లాకు వీరులపాడు మండలం సరిహద్దుగా ఉండటంతో తెలంగాణ వైపు నుంచి వీరులపాడు మండలానికి, నందిగామ మండలానికి వచ్చేవారు ఈ మార్గాన్నే ఎంచుకుంటారు. వర్షా కాలంలో ఎగువన తెలంగాణలో భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ వైరా, కట్టెలేరు ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటుంది. ఇక సంగమ ప్రాంతం కావడంతో ఇక్కడ వరద ఉధృతి మరింత అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో వరదలు వచ్చిన సమయంలో రోడ్డు దాటేందుకు సాహసించిన పలువురు గల్లంతై మృత్యువాత పడిన ఘటనలు కూడా ఉన్నాయి. ఓసారి వరద ఉధృతికి ఏకంగా ఆర్టీసీ బస్సు కొట్టుకుపోగా ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో ఊపిరిపీల్చుకున్నారు. దీంతో కాజ్‌వే స్థానంలో బ్రిడ్జి నిర్మించినప్పటికీ అప్రోచ్‌రోడ్డు నిర్మాణం మాత్రం ఏళ్లతరబడిగా పూర్తికాలేదు.



వర్షాకాలంలో కాజ్‌వేపై వరదనీటి ఉధృతి(ఫైల్)

కొట్టుకుపోయిన కాజ్‌వే...

గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌నెలల్లో భారీగా కురిసిన వర్షాలకు ఉధృతంగా వరదనీరు ప్రవహించడంతో కాజ్‌వే కొట్టుకుపోయింది. కాజ్‌వేకు ఏర్పాటు చేసిన బండరాళ్లు లేచిపోవటంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో వరద ఉధృతి తగ్గేంతవరకు రాకపోకలు నిలిచిపోయాయి. చిన్నపాటి వర్షం కురిస్తే కాజ్‌వేపై ఉన్న గోతులు కనిపించక ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి పల్లెంపల్లి వైపు, ఇటు దాములూరు వైపు అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

> **ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..**
>
> గతంలో నిధుల కొరత కారణంగా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టలేకపోయాం. ఈ విషయం ఇప్పటికే ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. సమస్యను మరోమారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటాం.
>
> – శశిభూషణ్, ఆర్‌అండ్‌బీ డీఈఈ

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



ముండ్లపాడులో పౌష్టికాహార ప్రాధాన్యతను వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



అనిగండ్లపాడులో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది సూచించారు. మండలంలోని ముండ్లపాడు, అనిగండ్లపాడు, పెనుగంచిప్రోలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. గృహ సందర్శన కార్యక్రమంలో భాగంగా ముండ్లపాడు గ్రామంలో గర్భిణులు, బాలింతలు ఇళ్ల వద్ద 1000 రోజుల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, జ్యోతి, రాణి, నిర్మల తదితరులు పాల్గొన్నారు. అనిగండ్లపాడు, పెనుగంచిప్రోలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించడంతోపాటు ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో సురక్షితం అన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సువర్చల, జయలక్ష్మి, నాగమణి, రాజ్యలక్ష్మి, స్వరూప, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామరూరల్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఇన్‌చార్జి సీడీపీవో కృష్ణకుమారి సూచించారు. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగనవాడీ కేంద్రాలలో ఏడో పౌష్టికాహార పక్షోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఎంతో శ్రేయస్కరమన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలన్నారు. తల్లిపాలతోపాటు చిరుధాన్యాలు, ఆకుకూరలు వంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కరుణకుమారి, వెంకటరావమ్మ, తారాబి, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో అధ్వానంగా పారిశుద్ధ్యం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): మండలంలోని తిరుమలగిరిలో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా తయారైంది. డ్రైనేజీ కాల్వల్లో పూడిక తీయకపోతుండటంతో మురుగంతా రోడ్లపైకి చేరుతోంది. ముఖ్యంగా తాగు నీటి ట్యాంకు వద్ద పిచ్చిమొక్కలు పెరగగా, డ్రైనేజీ కాల్వ ఉండటంతో ఆ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతోంది. ఈనెల 11 నుంచి గ్రామంలోని వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం కానుండటంతో పారిశుద్ధ్య పరిస్థితి మెరుగునకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పూడిక తీయకపోవడంతో పూడిపోయిన కాల్వ



అధ్వానంగా ఉన్న తాగు నీటి ట్యాంకు పరిసరాలు

కనులపండువగా పుష్పయాగ సేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో స్వామివారికి గురువారం పుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సీతాలక్ష్మణ, ఆంజనేయ సమేత శ్రీ కోదండరాముని ఉత్సవమూర్తులకు తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను చూసి ఉత్సవమూర్తులను రమణీయంగా అలంకరించారు. అనంతరం సుగంధ భరిత పుష్పాలతో స్వామి వారికి పుష్పయాగాన్ని నిర్వహించారు. ప్రముఖ ఆగమ పండితులు పర్యవేక్షణలో పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం రామరక్షా స్తోత్ర పారాయణం తదితర కార్యక్రమాలను జరిపారు.

నేత్రపర్వంగా ద్వాదశ ప్రదక్షిణలు..

కోదండరాముని సన్నిధిలో గురువారం రాత్రి స్వామి వారి ద్వాదశ ప్రదక్షిణల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన స్వామి వారికి శయనోత్సవ సేవ, ప్రథమ పవళింపు సేవను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యంపై తల్లి ఫిర్యాదు చేయగా కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టినగర్ గౌతమ్ స్కూల్ ప్రాంతంలో ఉంటున్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు. రెండో కుమార్తె(23) ఉద్యోగం నిమిత్తం బయటకు వెళుతున్నానని ఇంటి నుంచి వెళ్లారు. తన నుంచి ఎటువంటి స్పందనా లేకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని ఆరా తీశారు. వారి నుంచి కూడా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రిటైర్డ్ ఉద్యోగి అదృశ్యం..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బ్యాంకు పని మీద ఇంటి నుంచి బయటకు వెళ్లిన రిటైర్డ్ ఉద్యోగి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సితారా సెంటర్ లేబర్ కాలనీకి చెందిన అంబూరి ప్రసాద్(73) తెలంగాణ రాష్ట్ర కొత్తగూడెం సింగరేణి మెయిన్ వర్క్‌షాపులో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశారు. ఈనెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు ఐఓబీ బ్యాంక్‌లో పని ఉందని చెప్పి ఇంటినుంచి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులంతా కలిసి వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు కుమార్‌రాజు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉరేసుకుని యువకుడి మృతి

వత్సవాయి : ఓ యువకుడు ఉరేసుకుని మృతి చెందిన సంఘటన వత్సవాయిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన జెటిపిటి లక్ష్మీసుధాకరరావు ఖమ్మంలోని ఓ హోటల్ వద్ద నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలున్నారు, కూతురుకు వివాహం చేయగా ఆమె కూడా వత్సవాయిలోనే నివాసం ఉంటున్నారు. లక్ష్మీసుధాకరరావు బుధవారం రాత్రి ఇంటికి వచ్చే సమయానికి ఇంటి తాళం వేసిఉంది. అతనివద్ద రెండో తాళం ఉండటంతో తాళం తీసి లోపలికి వెళ్లి చూడగా కుమారుడు మణికంఠ(20) ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయి ఉండడాన్ని గమనించాడు. దీంతో ఆయన తన కుమారుడి మృతి అనుమానాస్పదంగా ఉందని పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


యురేకా సైన్స్ ఎక్స్‌పో విజేతలు వీరే

తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో ఫలితాలను జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ గురువారం తిరువూరులో వెల్లడించారు. మూఢనమ్మకాలు–శాస్త్రీయ దృక్పథం విభాగంలో జగ్గయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నాగి శ్యామశ్రీ జట్టు ప్రథమ స్థానం సాధించిందని తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో ప్రథమ స్థానాన్ని విజయవాడ వీపీఎస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కాకర్ల అశ్విన్ సాయి టీం, ద్వితీయ స్థానాన్ని ఎ.కొండూరు మండలం కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వి. ప్రవల్లిక జట్టు గెలుపొందాయని చెప్పారు. పర్యావరణం–సుస్థిరాభివృద్ధి విభాగంలో కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎన్. షకీనా, సీహెచ్ ఉదయకీర్తి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను జన విజ్ఞాన వేదిక ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీమోహన్, గంగాధర్ అభినందించారు.

పూలే జయంతి వేడుకలకు హాజరుకండి

కంచికచర్ల : సామాజిక విప్లవ యోధుడు మహాత్మా జ్యోతీరావు పూలే 198వ జయంతి కార్యక్రమం కంచికచర్ల కేవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ టెక్నాలజీ కాలేజీలో శుక్రవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు బహుజన రచయితల వేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి తంగిరాల సోనీ గురువారం తెలిపారు. కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం



కల్యాణోత్సవంలో భక్తులకు మంగళ సూత్రాలను చూపుతున్న అర్చకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కృష్ణానది తీరాన ప్రత్యేకంగా నిర్మించిన శ్రీవారి నమూన ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఉదయాస్తమాన సేవల్లో భాగంగా గురువారం నిర్వహించిన శ్రీవారి కల్యాణం అత్యంత కమనీయంగా సాగింది. పెనుమాకకు చెందిన శ్రీవైష్ణవ మహాదివ్య క్షేత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో భవానీపురంలోని బబ్బూరి గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న శ్రీవారి వైభవోత్సవ సహిత హనుమాన్ చాలీసా సమాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. తిరుమల తరహాలో జరుగుతున్న ఉదయాస్తమాన సేవలను వీక్షించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం ఎంఎస్ రామారావు (సుందరకాండ ఫేమ్) మనుమడు ఎంఎస్ శ్రీనివాస్ తన మృదుమధుర స్వరంతో సుందరకాండ, హనుమాన్ చాలీసా పారాయణ వినేందుకు వస్తున్న భక్తులతో కృష్ణాతీరం పులకించిపోతోంది. సేవా సంఘం కార్యదర్శి దూపగుంట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ వరకు శ్రీవారి ఉదయాస్తమాన సేవలు, హనుమాన్ చాలీసా పారాయణ కొనసాగుతాయని తెలిపారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, పక్కన నాయకులు

జగ్గయ్యపేట: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించలేకపోవడంతో రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. రైతులకు ఇస్తానన్న రూ. 20వేల పెట్టుబడి సాయం కూడా అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా తుంగలో తొక్కారని విమర్శించారు. గ్రామాలలో వరికోతలు మొదలయ్యాయని రైతులు పండించిన ధాన్యానికి రైతు భరోసా కేంద్రాలలో అమ్మకం చేసుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ తేమశాతం పేరుతో ప్రభుత్వ మద్దతు ధర ఇవ్వడ లేదన్నారు. దీంతో రైతులు దళారులను ఆశ్రయించి అయినకాడికి తక్కువ ధరకు విక్రయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జీపీఎస్ వాహనాలలోనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని అధికారులు చెబుతుండటం రైతులకు తలనొప్పిగా మారిందన్నారు. ఇందుకోసం ప్రభుత్వమే వాహనాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రైతులకు న్యాయం జరిగేలా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ పట్టణ కన్వీనర్ వట్టెం మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పఠాన్ హఫీజున్నిసా, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధానకార్యదర్శి కన్నమాల శ్యామ్యూల్, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట్ల వెంకటరెడ్డి, బీసీ సెల్ కన్వీనర్ జవ్వాజి నరసింహారావు, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు దారావత్ శ్యామల, ఎస్సీ సెల్ కన్వీనర్ బాణావత్ రాజు, నాయకులు దివ్వెల రామారావు, నరసింహారెడ్డి, గూడపాటి శేషగిరి, నంబూరి రవి, వెంకయ్య, ఆశీర్వాదం పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన

జగ్గయ్యపేట: పాఠశాలలు, కళాశాలల్లో ర్యాగింగ్‌లకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్ఐ రాజు హెచ్చరించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శక్తి యాప్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై గురువారం విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళల భద్రత కోసం శక్తి యాప్‌ను రూపొందించారన్నారు. ముఖ్యంగా విద్యార్థినులు ఈ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైనా ఇబ్బంది ఎదురైనప్పుడు శక్తి యాప్ ద్వారా సమాచారాన్ని తెలియజేయాలని కోరారు. ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన పారిశ్రామిక సదస్సులో ప్రతిభ కనబరిచిన పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి, వార్డు కౌన్సిలర్ గొట్టె నాగరాజు, ఎస్ఎంసి చైర్మన్ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాసిరకం పంచదార పంపిణీ

తీసుకునేందుకు నిరాకరించిన రేషన్‌కార్డుదారులు

కంచికచర్ల: పౌరసరఫరాలశాఖ రేషన్ కార్డుదారులకు తడిచిన పంచదారను సరఫరా చేయగా, ఆ పంచదారను తీసుకునేందుకు కార్డుదారులు విముఖత వ్యక్తంచేసిన ఘటన కంచికచర్లలో గురువారం చోటుచేసుకుంది. కార్డుదారులకు రేషన్‌బియ్యంతోపాటు అరకేజీ పంచదార కూడా పంపిణీ చేస్తున్నారు. అయితే ఈనెల కంచికచర్లకు వచ్చిన ఈ పంచదార తడిసి దుర్గంధం వెదజల్లుతుండటంతో ఈ పంచదారను కార్డుదారులు తీసుకోలేదు. పంచదార ప్యాకెట్ పూర్తిగా తడిసి సరుకంతా గడ్డలు కట్టి దుర్వాసన వస్తుండటంపై కార్డుదారులు వాహనమిత్రపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



కంచికచర్లలో పంపిణీ చేస్తున్న తడిచిన పంచదార

సత్యమ్మకు బోనాలు సమర్పణ



అంబారుపేట సత్యమ్మ అమ్మవారికి గ్రామ బోనాలు తెస్తున్న మహిళలు

నందిగామరూరల్: మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా గురువారం సత్యమ్మ అమ్మవారికి అష్టోత్తర సహస్రనామ పూజలు, ఖడ్గమాల, మూలమంత్ర హోమాది క్రతువులు వేదోక్తంగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి గ్రామ బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. నందిగామ, జగ్గయ్యపేట ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్ సత్యమ్మ అమ్మవారికి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు నందిగం సుబ్బారావు వారికి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో హరిగోపీనాథ్, ఉత్సవ కమిటీ సభ్యుడు మంచాల మాధవరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంఘం సేవలు అమోఘం



నేతల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రసాద్, గ్రంథాలయ సంఘం ప్రతినిధులు

పటమట(విజయవాడతూర్పు): భారతదేశంలో మొట్టమొదటి గ్రంథాలయ సంఘం 110 సంవత్సరాల క్రితం స్థాపితమై నేటికి అదే ఆశయంతో కృషి చేయటం గొప్ప విషయమని ప్రభుత్వ ఆస్పత్రి రిటైర్డ్ వైద్యాధికారి, పుస్తక ప్రియులు డాక్టర్ డి.ప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని పాతూరి నాగభూషణం గ్రంథాలయ శిక్షణాలయం ఆధ్వర్యంలో గురువారం సర్వోత్తమ భవనంలో జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక స్వచ్ఛంద సేవా సంస్థ శతాధిక సంవత్సరాలుగా మనుగడ సాగిస్తూ మరింతగా ఉత్సాహంగా పనిచేయడం అపురూపమన్నారు. సమాజంలో అందరూ విద్యా విజ్ఞానవంతులవ్వాలని తలంపుతో అయ్యంకి వెంకటరమణయ్య స్థాపించిన గ్రంథాలయ సంఘం పాతూరి నాగభూషణం, రావి శారద నేతృత్వంలో మరింత ముందుకు సాగుతూ విజ్ఞానదాయక ఫలాలు అందిస్తోందన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద కార్యక్రమాన్ని నిర్వహిస్తూ గ్రంథాలయ సంఘ ఆవిర్భావ విశేషాలను సాధించిన విజయాలను వివరించారు. గ్రంథాలయ శిక్షణాల విద్యార్థులు గురుమూర్తి, శ్రీరాములు, లిఖిత ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం, గ్రంథాలయ ఉద్యమంలోని ముఖ్య ఘట్టాలను తెలియజేశారు.